epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:348

24 క్యారెట్లు 143,460.00 | కిలో వెండి 2,35,000.00 | chourastha Digitals | 21.07.2026 మంగళవారం, హైదరాబాద్

## 66.59 శాతం సర్ ప్రక్రియ పూర్తి



- యాదాద్రి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాల్లో అత్యధికం
- హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అత్యల్పం
- రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి

2లో



## రాష్ట్రంలో తీవ్రంగా ఎల్నినో ప్రభావం

- రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి
- ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవు...వర్షా లు కూడా తక్కువే
- ఎల్నినో ప్రభావంపై అధికారులతో మంత్రులు అడ్లూరి,ఉత్తమ్ సమీక్ష
- తక్కువనీరు అవసరమయ్యే పంటలు సాగు చేసుకోవాలి
- ఎల్నినో పరిస్థితులకు తగ్గట్టుగా సిద్ధం కండి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**


రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్నినోను ఎదుర్కోవాల్సిన చర్యలపై నల్గొండ కలెక్టరేట్లో సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్లు సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎల్నినో ప్రభావం ఎక్కువగా ఉందని వివరించారు.
రైతులు వరి పంట వేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ విషయంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవని వర్షాలు కూడా తక్కువేనని మంత్రులు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపాలని సూచించారు. తక్కువ నీరు అవసరమయ్యే అరుతడి పంటలు వేసుకోవాలని దీనిపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్నినో పరిస్థితులకు తగ్గట్టుగా ఉమ్మడి నల్గొండ జిల్లా సిద్ధం కావాలన్నారు.
ఎల్నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీ ఎల్నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో సమీక్షించారు. ఎల్నినో ప్రభావంపై కేంద్రానికి నివేదిక ఇవ్వాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన

।మిగతా 2 లో।

## ట్రైనీ ఐపీఎస్ అధికారి సస్పెండ్

- ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- ఆత్మహత్యాయత్నం చేసిన ఐపీఎస్
- నాకు ఆమెతో సన్నిహిత సంబంధాలున్నాయి
- నన్ను కుట్రపూరితంగా ఇరికిరించారు
- సూసైడ్ నోట్లో ఉదయ్ కృష్ణారెడ్డి
- ప్రతిష్ఠాకరమైన ఎన్పీఏలో ఈ ఘటన జరగడంపై ఎంహెచ్ఏ ఆరా

2లో




"సహచర ఐపీఎస్ అధికారిణిపై లైంగికదాడి జరిపిన ఆరోపణలపై ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదరు కృష్ణారెడ్డి సస్పెండ్ అయ్యారు. ఈయనను కేంద్ర డీఓపీటీ మంత్రిత్వ శాఖ సస్పెండ్ చేస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది."



**ఉద్రిక్తంగా పార్లమెంట్ మార్చ్**

# పోటెత్తిన జంతర్ మంతర్

## యువతపై లాఠీచార్జీ, టియర్గ్యాస్, వాటర్కెనాన్స్ ప్రయోగం

- ఇంటర్నెట్, మొబైల్ నెట్వర్క్ నిలిపివేత
- లాఠీదెబ్బలు తింటూనే పార్లమెంట్ సమీపంలోకి
- దూసుకెళ్లిన ఆందోళన కారులు ఉలిక్కిపడిన కేంద్రం
- సీజేపీ నేతలతో కేంద్రమంత్రుల చర్చలు
- అమిత్షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తరలివచ్చిన విద్యార్థులు
- జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్, మహాత్మాగాంధీ చిత్ర పటాలతో యువత
- ఆస్పత్రిలో సోనమ్ వాంగ్ చుక్ దీక్ష కొనసాగింపు

"**ఢిల్లీ ఉలిక్కి పడింది.** దేశ యువతలోని ఆవేశం, ఆక్రోశం, ఆవేదన, ఆందోళనను తక్కువ అంచనా వేసిన కేంద్రం యువతరం పట్టుదలను చూసి ఖంగుతింది. నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్టీఏను రద్దు చేయాలని, ఎన్ఈపీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' ఉద్రిక్తంగా మారింది. ఢిల్లీలో భారీ వర్షం కురుస్తున్నా విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పార్లమెంటు ప్రాంగణానికి చేరుకునే ప్రయత్నం చేశారు. వారిని చెదరగొట్టేందుకు కేంద్ర బలగాలు, పోలీసులు లాఠీచార్జీ చేశారు. టియర్గ్యాస్ ప్రయోగించారు.

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

వాటర్ కెనాన్స్తో యువతను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. చేతుల్లో జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్, మహాత్మాగాంధీ చిత్ర పటాలతో లాఠీదెబ్బలు తింటూనే యువత పార్లమెంటు భవనం సమీపంలోకి చొచ్చుకెళ్లింది. ఈ ఘటనలో అనేక మంది యువతీ యువకులు, విద్యార్థులు గాయపడ్డారు. వందలాది మందిని అరెస్టు చేసి ఢిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా యువతరం బెదరలేదు. మరోవైపు పార్లమెంటులోనూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. సీజేపీ డిమాండ్లలో తప్పు ఏముందో చెప్పాలంటూ కేంద్ర మంత్రుల్ని నిలదీశారు. సర్కారు లోపాలు, బాధ్యతారాహిత్యానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించాయి. ఇంటా, బయట పరిస్థితులు

।మిగతా 2 లో।



## వాడివేడిగా పార్లమెంట్

- రామ మందిరంలో విరాళాల చోరీ, నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై ప్రతిపక్షాల నిలదీత
- ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాల్లో నుంచే లేచి నినాదాలు
- ఆరు సార్లు వాయిదా
- ఉభయ సభలు సభ నేటికి వాయిదా

2లో

## ఇంటిపై విరిగిపడిన కొండచరియలు

- ఒకే కుటుంబంలో ఏడుగురు మృతి
- మృతుల్లో నలుగురు మహిళలు
- ఘటనాస్థలంలో సహాయక బృందాలు సహాయక చర్యలు
- జమ్ముకశ్మీర్లో కుండపోత వర్షా లు
- ఇప్పటికే 17 మంది ప్రాణాలు కోల్పోగా
- మరో ఆరుగురు గల్లంతు
- వరదలు, కొండచరియలు పలుచోట్ల భారీ నష్టం
- జమ్ములో అప్రమత్తమైన యంత్రాంగం



**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

జమ్ముకశ్మీర్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగులుస్తున్నాయి. పూంఛ్ జిల్లాలోని లొరాన్ గ్రామంలో సోమవారం మట్టితో నిర్మించిన ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో

।మిగతా 2 లో।



## రేవంత్ రెడ్డి ఒక చిచోరా

### ఆయనకు రైతులకు నీళ్లివ్వడం తెలియదు

### ఢిల్లీకి మూటలు పంపడమే తెలుసు

- కాళేశ్వరం నీళ్లు సముద్రం పాలు
- కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయని సీఎం
- రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం
- రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో ఉంటే ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో పడుకుంది
- సంక్షోభంలో సేద్యం రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా సిద్ధం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్లో చేరిన బాన్సువాడ ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం నీళ్లు సముద్రం పాలవుతుంటే కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో ఉంటే ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో పడుకుందని విమర్శించారు. సోమవారం హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో బాన్సువాడకు

।మిగతా 2 లో।

# రేవంత్ రెడ్డి ఒక చిచోరా

తరువాయి భాగం

చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక 'చిచోరా'అని విమర్శించారు. ఆయనకు రైతులకు నీళ్లివ్వడం తెలియదనీ, ఢిల్లీకి మూటలు పంపడమే తెలుసని అన్నారు. ఎల్‌నినో వస్తుందని శాస్త్రవేత్తలు ఆర్నెల్ల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు. ప్రభుత్వం ఇప్పుడు సమావేశాలు పెడితే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా కొరత, విద్యుత్ సమస్యలు, ధాన్యం కొనుగోలు ఇబ్బందులు, సాగునీటి కొరత వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా తాము సిద్ధమని ప్రకటించారు. 70 వేల ఉద్యోగాల భర్తీపై తన సవాల్‌ను స్వీకరించే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా?అని ప్రశ్నించారు. 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు రుజువు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండాను ఎగరేసి పోచారం శ్రీనివాస్ రెడ్డిని విశ్వసించి గెలిపించారనీ, ఆయన ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. గాచారం బాగాలేకనే పోచారం వేరే దానికి పోయిండన్నారు. రానున్న ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడించడమే బీఆర్ఎస్ కార్యకర్తల లక్ష్యంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా రైతులకు నీళ్లు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని వృథాగా సముద్రంలోకి వదులుతోందని ఆరోపించారు. "ఇక్కడ నీళ్లు లేవంటారు. కానీ అదే నీళ్లు కిందకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌లో మోటార్లు నడుస్తున్నాయి. వరంగల్‌లో దేవాదుల, ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అక్కడ నీళ్లు ఉంటే ఇక్కడ ఎందుకు లేవు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రాణాలైనా ఇస్తామనీ, రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా సిద్ధమనీ, పంటలను ఎండబెట్టే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. మోరిల్ శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంత్ షిండే, జీవన్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోటెత్తిన జంతర్ మంతర్

తరువాయి భాగం

తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో కేంద్రం దిగిరాక తప్పలేదు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా సీజేపీ నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు తమ మూడు ప్రధాన డిమాండ్లను ఆయన వద్ద పునరుద్ఘాటించారు. మరోవైపు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆస్పత్రిలో నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఎస్ఎఫ్ఐ నేతలు ఆదర్శ ఎం.సాజీ, ఆయుషీ ఘోష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నేహా, మనీష్, అమీన్ లు తమ దీక్షల్ని విరమించారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు.

**ఆందోళనకారులతో నిండిన జంతర్‌మంతర్**

సీజేపీ నేతృత్వంలో చేపట్టిన పార్లమెంట్ మార్చ్‌తో ఢిల్లీ జంతర్‌మంతర్ యువతరంతో నిండిపోయింది. విద్యార్థులు, యువతీ యువకులు భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా అక్కడకు తరలివచ్చారు. వారి నిరసనలతో దేశ రాజధాని స్తంభించింది. భారీ వర్షం కురుస్తున్నా, పోలీసుల ఆంక్షలు హెచ్చరిస్తున్నా యువతరం ఎక్కడా బెదరలేదు. సోమవారం ఉదయాన్నే దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. వారికి సంఘీభావంగా పలువురు సినీ నటులు, రాజకీయ నేతలు, ప్రజాస్వామ్యవాదులు, హక్కుల కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

**పార్లమెంట్ సమీపానికి విద్యార్థులు, యువత**

మధ్యాహ్నం తరువాత జంతర్ మంతర్ నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న పార్లమెంట్ వైపునకు పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు కదిలారు. జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్, మహాత్మా గాంధీ తదితర ప్రముఖుల చిత్ర పటాలను చేతిలో పట్టుకొని శాంతియుతంగా నినాదాలతో ముందుకు సాగారు. కొందరు సంసద్ మార్గ్ వైపు నుంచి పార్లమెంట్ చేరుకునేందుకు ప్రయత్నించారు. వారిని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. నిరసనకారులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. పలువురికి గాయాలయ్యాయి. వీరికి అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు. మరోవైపు జంతర్ మంతర్ సర్కిల్ వద్ద నుంచి మరికొంత మంది పార్లమెంట్ వైపు కదం తొక్కారు. వీరిని పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. వేలాది సంఖ్యలో ఉన్న ఆందోళనకారులను అడ్డుకోవడం భద్రతా బలగాలకు సాధ్యం కాలేదు. నిర్బంధాలను ఎదుర్కొంటూ, లాఠీదెబ్బలు తింటూఆదే మార్గంలో ముందుకు నడుస్తూ, రైసినా హిల్స్ మీదుగా పార్లమెంట్ వైపునకు వెళ్లారు. ఈ సందర్భంగా రైల్ భవన్, పార్లమెంట్ సమీపాన ఉన్న ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా దగ్గర విద్యార్థులు, యువతపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ భాష్ప వాయువు(టియర్ గ్యాస్)ను ప్రయోగించింది. అనంతరం లాఠీచార్జీ చేసి విద్యార్థులు, యువతపై తీవ్రంగా విరుచుకుపడ్డారు.

**పార్లమెంట్ మెయిన్ గేట్ మూసివేత**

సీజేపీ మార్చ్ పార్లమెంట్ సమీపానికి రావడంతో పార్లమెంట్ భద్రతా బలగాలు ఒక్క సారిగా అలర్ట్ అయ్యాయి. విజయ్ చౌక్ నుంచి పార్లమెంట్‌కు ఉపరాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రి, ఇతర మంత్రులు, ఎంపీలు వెళ్లే మెయిన్ గేట్‌కు పార్లమెంట్ భద్రతా సిబ్బంది తాళం వేశారు. ఈ గేటును దాటుకొని వస్తే అడ్డుకునేలా ఫైర్ ఇంజన్ పైపులను పోలే వాటర్ పైపులను సిద్ధం చేసుకున్నారు. పరిస్థితులు చేయి దాటితే తుపాకి కాల్పులు చేసేలా సీఐఎస్ఎఫ్ సిబ్బంది పొజిషన్ తీసుకున్నారు. ప్రెస్ క్లబ్ దగ్గర ఉద్రిక్తత ఏర్పడటంతో ఆ సమీపంలోని కేంద్ర ప్రభుత్వ ఆఫీసులను మూసి వేశారు. ఎవరినీ లోనికి రాకుండా భద్రతను పెంచారు.

**'ఎంతైనా కొట్టండి' 'బొద్దింకల' గాండ్రింపు**

ఇండియా గేట్, పార్లమెంట్‌కు వెళ్లే రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. కానీ ప్రజలు వీటన్నింటినీ దాటుకుని ఢిల్లీకి తరలిరావడంతో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలు వృధా అయ్యాయి. పార్లమెంట్ సమీప ప్రాంతం 'బొద్దింకల'తో నిండిపోయింది. 'పార్లమెంట్ మార్చ్' లో పాల్గొన్న నిరసనకారులపై పలు చోట్ల పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసుకొని, రౌండప్ చేసి లాఠీలతో చితకబాదారు. ఒక ఆందోళన కారుడిని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(చుట్టు ముట్టి) ఐదుగురు కలిసి చావ బాదారు. ఈ దెబ్బలను తట్టుకొని అలాగే నిలిచిపోయిన నిరసనకారుడు ఎంతైనా కొట్టండి అంటూ అరుస్తోన్న వీడియో వైరల్ అయింది. మరి కొన్ని చోట్ల ఇలాంటి పరిస్థితే కనిపించింది. ఒక యువకుడికి చాఠీఛార్జ్‌లో కాలికి తీవ్రగాయమైంది. అయినప్పటికీ, నినాదాలు చేస్తూనే ఉండటం అక్కడివారిని కదిలించింది. అంతకు ముందు.. మద్దతుదారులు "శాంతంగా ఉండాలి" అని సీజేపీ కోరింది. 'కొన్ని చోట్ల మిమ్మల్ని అడ్డగించినప్పటికీ, ప్రశాంతంగా ఉండి శాంతిని కాపాడండి. మనం శాంతి, ప్రేమతో మాత్రమే దీన్ని గెలుస్తాం" అని పేర్కొంది. దీంతో విద్యార్థులు, యువత ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులే విద్యార్థులు, యువతపై అమానవీయంగా దాడికి దిగారు. నటులు ప్రకాష్ రాజ్, షబానా అజ్మీలపై కూడా భద్రతా దళాలు దాడి చేశాయి. గీతాంజలి ఆంగ్మోపై దారుణంగా దాడి జరిగింది. జంతర్ మంతర్ వద్ద నిరసన వేదికలను ధ్వంసం చేశారు.

**మెట్రో స్టేషన్లు మూసివేత**

సీజేపీ పార్లమెంట్ మార్చ్ నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పార్లమెంట్ తో కనెక్ట్ అయ్యే జన్ పథ్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియల్, సేవా తీర్థ్ మెట్రో స్టేషన్లను మూసివేసింది. అలాగే లోక్ కళ్యాణ్ మార్గ్ (ప్రధాని నివాసం సమీపంలోని) మెట్రో స్టేషన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాని ఇంటి వైపు మార్గాల్లో రెండంచెల భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలు, మొబైల్ నెట్‌వర్క్‌లను నిలిపివేశారు.

**చర్చలకు వచ్చిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా**

పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సీజేపీ నేతలతో చర్చలకు వచ్చారు. సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రంగ, సౌరవ్ దాస్ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాతో భేటీ అయ్యారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో తక్షణమే రాజీనామా చేయించి, పదవి నుంచి తొలగించాలని కోరుతూ, తమ డిమాండ్లతో కూడిన ఒక వినతిపత్రాన్ని వారు అందజేశారు. ఈ డిమాండ్లపై తగిన స్థాయిలో చర్చిస్తామని నడ్డా చెప్పారు. అయితే, చర్చల్లో ఎలాంటి హామీ లభించలేదని, తమ డిమాండ్లను అంగీకరించే వరకు శాంతియుత నిరసనలు ఆపబోమని సౌరవ్ దాస్ అన్నారు. మరోవైపు పార్లమెంట్ లోని తన ఛాంబర్ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమావేశం అయ్యారు.

**ఖండించిన ప్రతిపక్షాలు**

కేంద్ర ప్రభుత్వ చర్యల కారణంగా సోమవారం ప్రారంభమైన పార్లమెంటులో గందరగోళం నెలకొంది. పోలీసుల క్రూరత్వాన్ని కాంగ్రెస్, సీపీఐ(ఎం) టీఎంసీ, డిఎంకె, ఆప్, ఎస్‌పి, ఎన్‌సిపితో పాటు దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి

# ఇంటిపై విరిగిపడిన కొండచరియలు

తరువాయి భాగం

ఒకే కుటుంబంలోని ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలో సహాయక బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. శనివారం సాయంత్రం నుంచి పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా ఇప్పటివరకు మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు గల్లంతయ్యారు. వరదలు, కొండచరియలు పలుచోట్ల భారీ నష్టం కలిగించాయి.

భారీ వర్షాలు, ఆకస్మిక వరదల హెచ్చరికల నేపథ్యంలో జమ్మూ నగరంలోని వంతెనలు, నదులు, వాగులు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో సివిల్ డిఫెన్స్ సిబ్బందిని అధికారులు మోహరించారు. ప్రజలు నదులు, వాగుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తం చేస్తున్నారు. సివిల్ డిఫెన్స్ డిప్యూటీ చీఫ్ వార్డెన్ విజయ్ మగోత్రా మాట్లాడుతూ, ఎడతెరిపి లేని వర్షాలతో నదుల్లో నీటి మట్టం వేగంగా పెరుగుతోందని తెలిపారు. అమర్‌నాథ్ యాత్రికులు, స్థానికులు ఎవరూ నదులు, వాగుల సమీపానికి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. కొందరు స్నానాలు, పిక్నిక్‌ల కోసం నదుల వద్దకు వెళ్తుండటంతో వారిని వెంటనే అక్కడి నుంచి వెళ్లేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సివిల్ డిఫెన్స్ అధికారి అరవింద్ గుప్తా మాట్లాడుతూ, జులై 20 నుంచి 24 వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు.

**వరద ప్రభావిత ప్రాంతాల్లో బీజేపీ బృందం పర్యటన**

పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ నేతృత్వంలోని బీజేపీ ప్రతినిధి బృందం సందర్శించింది. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా, మాజీ మంత్రి షామ్‌లాల్ శర్మ కూడా ఈ బృందంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకున్న అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని సునీల్ శర్మ తెలిపారు. నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సహాయం, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. అవసరమైన అన్ని విధాలా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.


# అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట తెలంగాణ చౌరస్తా

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేటలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలిపారు.డెయిరీ సైన్స్, కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్ సబ్జెక్టుల పోస్టులకు సంబంధిత విభాగంలో పీజీతో పాటు నెట్, సెట్, ఎం.ఫిల్ లేదా పీహెచ్‌డీ అర్హతల్లో కనీసం ఏదైనా ఒకటి కలిగిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లతో నిర్ణీత సమయానికి హాజరు కావాలని ప్రధానాచార్యులు కోరారు.

# అదనపు కట్నం తేవాలని వేధింపులు

- కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితురాలు
- భర్త, కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- కలెక్టరేట్ ఎదుట బైఠాయించి న్యాయం కోరిన మహిళ



పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసి ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఆరోపిస్తూ భర్తతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి జిల్లాకు చెందిన భజ్జారి రేఖలత సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లికి చెందిన రేఖలతకు భీమారం ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్‌తో వివాహం జరిగింది. పెళ్లి అయినా కొంతకాలం వరకు దాంపత్య జీవితం సజావుగానే సాగినప్పటికీ, అనంతరం అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, ఆయన కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. గతంలో ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీలో ఇకపై సక్రమంగా చూసుకుంటానని భర్త హామీ ఇచ్చాడని తెలిపారు. అయితే ఆ హామీని నిలబెట్టుకోకుండా ఇంటికి తీసుకెళ్లకుండా వాట్సాప్ సందేశాలు, నోటీసుల ద్వారా వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపించారు. అలాగే తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని, తనపై భౌతిక దాడులకు పాల్పడ్డాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఆర్థిక ఆధారం లేకుండా పెద్దపల్లిలో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నానని రేఖలత తెలిపారు. భర్త, ఆయన కుటుంబ సభ్యులు తోటి కోడలు, బావల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# 66.59 శాతం సర్ ప్రక్రియ పూర్తి

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ ఈ నెల 20వరకు 66.59 శాతం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇంకా 33.41 శాతం మంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను పూరించి బీఎల్ఓలకు అందజేయాల్సి ఉందని తెలిపింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 89.42 శాతం, ఆ తర్వాత సిద్దిపేట జిల్లాలో 84.68, నల్లగొండ జిల్లాల్లో 83.62 శాతం ప్రక్రియ పూర్తయిందని ఈసీ వెల్లడించింది. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 39.91 శాతం, ఆ తర్వాత హైదరాబాద్ జిల్లాలో 41.73, రంగారెడ్డి జిల్లాలో 50.82 శాతం మంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించారని తెలిపింది.

# వాడివేడిగా పార్లమెంట్

తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే పార్లమెంట్ దద్దరిల్లింది. నీట్ ప్రశ్నాపత్రం లీక్, అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ వంటి అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీనికి ప్రభుత్వం విముఖత వ్యక్తం చేయడంతో ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు ఆరు సార్లు వాయిదాపడ్డాయి. చివరికి నేటి(మంగళవారం)కి సభ వాయిదా పడింది. సోమవారం లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు సిద్ధపడ్డారు. అయితే ప్రతిపక్షాలు నీట్ ప్రశ్నాపత్రం లీక్, అయోధ్య రామ మందిరంలోని విరాళాల దొంగతనంపై చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాల్లో నుంచే లేచి నినాదాలు హోరెత్తించారు. సభ్యులు సంయమనం పాటించాలని స్పీకర్ ఓం బిర్లా విజ్ఞప్తి చేశారు. నినాదాలతో సభ పని చేయలేదని, సభా కార్యకలాపాలు కొనసాగేలా చూడాలని కోరారు. అయినా నిరసనలు కొనసాగుతుండటంతో ఆయన సభ ప్రారంభమైన 13 నిమిషాల్లోనే వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో గందరగోళం మధ్యే న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. అయినప్పటికీ సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ ప్రారంభమైన ఆరు నిమిషాల్లోనే (మధ్యాహ్నం 12.30 గంటలకు) ప్యానెల్ స్పీకర్ దిలీప్ సైకియా సభను వాయిదా వేశారు. ఆ తర్వాత ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో ఐదు నిమిషాల్లోనే మళ్లీ మధ్యాహ్నం 1 గంటకు సభ వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలోనూ అదే పరిస్థితి కొనసాగడంతో ప్యానెల్ స్పీకర్ దిలీప్ సైకియా రెండు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2.00 గంటలకు సభను వాయిదా వేశారు. మరలా సభ ప్రారంభమైనా ప్రతిపక్షాల ఆందోళన అదే విధంగా కొనసాగింది. దీంతో ప్యానెల్ స్పీకర్ జగదాంబికా పాల్ మూడు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2.30 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగా మూడు నిమిషాల్లోనే మధ్యాహ్నం 3 గంటల వరకు సభను వాయిదా వేశారు. ఆ తర్వాత ప్రారంభమైన సభలో కూడా అదే పరిస్థితి నెలకొనడంతో ప్యానెల్ స్పీకర్ జగదాంబిక పాల్ సభను రెండు నిమిషాల్లోనే నేటి (మంగళవారం)కి వాయిదా వేశారు.

రాజ్యసభలో కూడా అదే తంతు కొనసాగింది. రాజ్యసభను చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రతిపక్ష సభ్యులు నీట్ ప్రశ్నాపత్రం లీక్, అయోధ్య రామ మందిరంలో విరాళాల దొంగతనం అంశాలను లేవనెత్తారు. ఆయా అంశాలపై చర్చించాలని పట్టుపట్టారు.

**ప్రతిపక్షాల భేటీ**

సమావేశానికి ముందే ప్రతిపక్షాలన్నీ సమావేశమయ్యాయి. ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరేందుకు ఇండియా బ్లాక్ నేతలు నిర్ణయించారు. రామ మందిర విరాళాల అక్రమాలు, విద్యా వ్యవస్థ 'కుప్పకూలడం' వంటి పలు అంశాలపై ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరాలని నిర్ణయించారు.ఈ సమావేశానికి ముందు ప్రతిపక్ష నాయకులు , రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో సమావేశమయ్యారు. "2015 నుంచి 152 సార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి, 25 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తప్పక తొలగించాలి" అని ఖర్గే అన్నారు. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, గౌరవ్ గొగోయ్, జైరాం రమేష్, సుప్రియా సూలే, సాగరికా ఘోష్, సంజయ్ రౌత్, జాన్ బ్రిట్టాస్‌తో పాటు ఇండియా బ్లాక్ పార్టీల నాయకులు హాజరయ్యారు.

# రాష్ట్రంలో తీవ్రంగా ఎల్నినో ప్రభావం

తరువాయి భాగం

కార్యదర్శి సంజయ్ఝాజు ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించిన విషయం తెలిసిందే. ఎల్నినో ప్రభావం దృష్ట్యా ఆరు తడి పంటలు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి వైపు వెళ్లకుండా సజ్జ, జొన్న, రాగి, వరిగలు, కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి వాటితో పాటు ఆవాలు, టమాట, సోర, వంగ, బీర, దోస, కాకర వంటి కూరగాయలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా రైతుల్లో స్పందన లేదు. వరి సాగుచేసిన భూముల్లో ముఖ్యంగా నల్లరేగడి నేలలో ఇతర పంటల సాగుకు యోగ్యంకాదని రైతులు చెబుతున్నారు. సన్నరకాల వరి పండించేందుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. వరి తర్వాత అధికంగా పత్తిని రైతులు సాగుచేసేవారు. రెండు లక్షల సాధారణ సాగు విస్తీర్ణానికి ప్రస్తుతం లక్షఎకరాల్లో వేశారు. భవిష్యత్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రమైతే రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# ట్రైనీ ఐపీఎస్ అధికారి సస్పెండ్

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

శివరాంపల్లిలోని ప్రతిష్టాత్మక సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న ఉదరు కృష్ణారెడ్డి తన తోటి మహిళా ఐపీఎస్ అధికారిపై లైంగికదాడి జరిపినందుకు గానూ స్థానిక అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ విషయమై సమాచారం అందుకున్న డీఓపీటీ విభాగం సీరియస్ అయింది. దీనిపై ఎన్‌పీఏ డైరెక్టర్‌తో జరిగిన ఘటనపై వివరాలను తెప్పించుకున్న డీఓపీటీ.. ఉదరు కృష్ణారెడ్డిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.ఇదిలా ఉంటే తనపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యాక సంజీవరెడ్డి నగర్‌లోని తన సోదరుడి నివాసానికి ఉదరుకృష్ణారెడ్డి వెళ్లిపోయాడు. అక్కడే ఉన్న ఆయన సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన సోదరుడు, ఆయన స్నేహితులు ఉదరుకృష్ణారెడ్డిని అపస్మారక స్థితిలో స్థానిక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేరాక ఉదరు కృష్ణారెడ్డికి అత్యవసర చికిత్స ప్రారంభించిన డాక్టర్లు.. ఆయనకు వాంతులు చేయించి, బయటపడ్డ పదార్థంలో విషతుల్య పదార్థాలు ఏమైనా ఉన్నాయా అని మొదట పరీక్ష చేశారు. అనంతరం ఉదరు కృష్ణారెడ్డి రక్తం, మూత్రంను పరీక్షలకు పంపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డాక్టర్లు మాట్లాడుతూ.. ఆయన పూర్తిగా అపస్మారక స్థితిలో ఉన్నాడనీ, 24 గంటలు గడిస్తేనే ఆయన స్పృహలోకి వస్తాడని భావిస్తున్నామనీ, వాంతింగ్ చేసుకున్న పదార్థంలో విషతుల్య పదార్థాలు ఏవీ తమకు తేలలేదని తెలిపారు. మూత్ర, రక్త పరీక్షల రిపోర్టులు వస్తే గానీ ఉదరుకృష్ణారెడ్డి ఏమి తీసుకున్నాడో తేలుతుందని చెప్పారు.

కాగా తన సోదరుడు కానిస్టేబుల్ స్థాయి నుంచి కష్టపడి చదివి, ఐపీఎస్‌గా ఎదిగాడనీ, ఆయనకు ఎలాంటి చెడు అలవాట్లు లేవని సోదరుడు తెలిపాడు. దీని వెనుక కారణాలను సమగ్రంగా దర్యాప్తు జరిపితే తేలుతుందని అన్నాడు. ఇదిలా ఉంటే.. ఉదరు కృష్ణారెడ్డి రాసిన సూసైడ్ నోట్ ఒకటి సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. తనకు బాధిత మహిళా ఐపీఎస్ అధికారితో 2025 జూన్ నుంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆ నోట్‌లో ఉదరు కృష్ణారెడ్డి పేర్కొనట్టుగా ఉంది. అదే విషయాన్ని తాను ఆమె భర్తకు కూడా సమాచారం ఇచ్చినట్టుగా వివరించాడు. తనను ఆమెతో పాటు మరో ఇద్దరు కుట్రపూరితంగా కేసులో ఇరికించారనీ, అందుకే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఉదరు కృష్ణారెడ్డి రాసుకున్న లేఖలో ఉంది. ఈ లేఖపై దర్యాప్తు జరుపుతున్న అత్తాపూర్ పోలీసులు కూడా సీరియస్‌గా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. కాగా దేశంలోనే సివిల్ సర్వీస్‌లో ఎంపికైన ఐపీఎస్ అధికారులకు శిక్షణ నిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో పేరు, ప్రతిష్టలు గడించిన జాతీయ పోలీసు అకాడమీలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సీరియస్ అయినట్టు తెలిసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్‌పీఏ డైరెక్టర్‌ను కేంద్ర హోం శాఖ ఆదేశించినట్టు సమాచారం.

# విద్యార్థుల ప్రదర్శనపై పోలీసుల దాడి అమానుషం

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి
- తక్షణమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- పిడిఎస్ యు డివిజన్ అధ్యక్షులు గడ్డం గౌతమ్




తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:

నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఢిల్లీలో విద్యార్థులు చేస్తున్న శాంతియుత ప్రదర్శనపై పోలీసుల దాడిని ఖండించండని పిడిఎస్ యు విద్యానగర్ డివిజన్ అధ్యక్షులు గడ్డం గౌతమ్ అన్నారు. సోమవారం పిడిఎస్ యు విద్యానగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విఎస్ టి సింగ్నల్ వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం విద్యానగర్ డివిజన్ అధ్యక్షులు గడ్డం గౌతమ్ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా,నీట్ మరియు ఇతరత్రా ప్రశ్నాపత్రాల లీకేజీల పై పార్లమెంట్లో చర్చ జరపాలని, జంతర్ మంతర్ నుండి పార్లమెంటరీ వరకు శాంతియుతంగా జరిగే ర్యాలీని చెయ్యనివ్వకుండా, కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని విద్యార్థులపై టీయర్ గ్యాస్ ను ప్రయోగిస్తూ లాఠీ చార్జ్ చేయడం దుర్మార్గం అన్నారు.ఈ కార్యక్రమాన్ని డివిజన్ నాయకులు నవదీప్, అమర్, శ్రీకాంత్, వినయ్,భాను ప్రకాష్ అరవింద్,సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకుల పరామర్శ..

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

ముత్తారం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం తండ్రి చొప్పరి లింగయ్య దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ హాజరై లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన లింగయ్య మంచితనాన్ని, జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందంను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణటి గౌడ్, కాంగ్రెస్ నాయకులు అంబీర్ శ్రీనివాస్, సయ్యద్ ఇక్బాల్, ఇనగంటి చిన్నరావు, మల్యాల మహేష్‌గౌడ్, చాట్ల రాయమల్లు, చాట్ల గట్టయ్య, రేకుంట్ల సందీప్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



## సర్ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటు నమోదు ప్రక్రియను సోమవారం పెద్దపల్లి డిసిసి కార్యదర్శి గాండ్ల మోహన్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటర్ల క్రమసంఖ్య, పోలింగ్ స్టేషన్ వివరాలను పరిశీలించి సవరణలపై బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం కమాన్‌పూర్ మండల కేంద్రంలో 40 శాతం మాత్రమే ఓటు నమోదు పూర్తయిందని, ఆగస్టు 3 నాటికి 100 శాతం ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మెరుగు కుమార్, బిఎల్‌ఏల, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.



## వానమ్మ రాకకై భక్తమండలి భజన

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట మండలం,కోటకొండ గ్రామంలో వర్షాలు లేక సమస్త మూగ జీవులు,రైతులు వేసిన పంటలకు నీరు లేక మొక్కలు ఎండిపోతున్నాయని గ్రామ పెద్దలు ఊరందరి సమక్షంలో శ్రీ కనక సముద్రం నుండి జల్దిబిందె తెచ్చి,అనంతరం సప్తభజన శ్రీ రాధ కృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ప్రారంభించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈ వెంకట్రాములు గౌడ్,శ్రీనివాసులు,రాములు,సాయిలు,రమేష్,రాజు,మల్లేష్,నర్సింలు, భగవంతు,దస్థప్ప,తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి నగర్‌లో రూ.48.65 లక్షలతో యూజీడీ పనులకు శంకుస్థాపన

- మౌలిక వసతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా :**



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో మహంకాళి నగర్ చౌరస్తా నుంచి తులసి వనం ఔట్‌లెట్ వరకు రూ.48 లక్షల 65 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు కలిగిస్తున్న భూగర్భ డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, స్థానిక పరిస్థితులను పరిశీలించిన అనంతరం అత్యవసరంగా అవసరమైన ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.మహంకాళి నగర్ లో తరచూ డ్రైనేజీ పొంగిపొర్లడం తో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.48.65 లక్షల వ్యయంతో యూజీడీ పైప్‌లైన్ నిర్మాణాన్ని ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా నిత్యం డ్రైనేజీ సమస్యలు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందుగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యూజీడీతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన పైప్‌లైన్ వ్యవస్థను కూడా దశల వారీగా బలోపేతం చేస్తామని గాంధీ తెలిపారు. ప్రతి కాలనీని సమస్యల రహితంగా, ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించిన పీఏసీ చైర్మన్, నిర్ణీత గడువులోనే పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజల నుంచి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, జలమండలి జనరల్ మేనేజర్ హరిశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరాజు, మేనేజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు, రమేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డా. పిడమర్తి రవితో మంత్రిని కలిసి రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ అంశాలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు సమాచారం. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వివరించారు. ఈ మర్యాదపూర్వక భేటీలో నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేయగా, రాష్ట్రాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# జర్నలిస్ట్ సురేంద్రబాబును పరామర్శించిన పసుమర్తి లక్ష్మణ్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో: తెలంగాణ చౌరస్తా :**



ఇల్లెందు పట్టణానికి చెందిన 'అక్షర కలం' దిన పత్రిక పాత్రికేయుడు దాస్యం సురేంద్రబాబును ఆదివారం సీనియర్ జర్నలిస్ట్, మాజీ ఇల్లందు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, జిల్లా మెడికల్ అసోసియేషన్ నాయకులు పసుమర్తి లక్ష్మణ్ పరామర్శించారు. ఇటీవల ఇల్లందు కొత్త బస్టాండ్ సమీపంలో స్కూటర్ స్కిడ్ కావడంతో సురేంద్రబాబు ఎడమ కాలు పాదం ఫ్రాక్చర్ అయింది. ఈ విషయం తెలుసుకున్న పసుమర్తి లక్ష్మణ్, 'మీ వార్త' ప్రతినిధితో కలిసి ఆదివారం సురేంద్రబాబు నివాసానికి వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని, కాలు గాయానికి జరుగుతున్న వైద్య చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకుని మళ్లీ మునుపటిలా చురుగ్గా విధుల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

**సురేంద్రబాబు కృతజ్ఞతలు:**

గత రెండు నెలలుగా కాలు గాయంతో ఇంటికే పరిమితమై ఇబ్బంది పడుతున్న తనను, ఎంతో బిజీ షెడ్యూల్‌లోనూ సమయం కేటాయించి పరామర్శించడానికి వచ్చిన సీనియర్ జర్నలిస్ట్ పసుమర్తి లక్ష్మణ్‌కు, 'మీ వార్త' ప్రతినిధికి సురేంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. తోటి పాత్రికేయులకు ఏ కష్టం వచ్చినా తక్షణమే స్పందించే గుణం ఉన్న పసుమర్తి లక్ష్మణ్‌పై దేవుని కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు.

# హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్లకు శ్రీకారం

- నిరుపేదలకు సొంతింటి కల సాకారం దిశగా ప్రభుత్వం అడుగు

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**



హైదరాబాద్ నగరంలోని అల్పాదాయ వర్గాలకు సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఎల్ఐజీ గృహ నిర్మాణ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని నగర ప్రాంతాలకు విస్తరిస్తూ, హైదరాబాద్‌లో ని క్యూర్ (CURE) పరిధిలో ఎల్ఐజీ గృహాల నిర్మాణాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా దరఖాస్తు విధానం, అర్హతలు, గృహ నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలతో రూపొందించిన అధికారిక బ్రోచర్‌ను మంత్రులు విడుదల చేశారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు శాశ్వత గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి విడతలో సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, వాటిలో 2 లక్షలకు పైగా ఇళ్లు ఆగస్టు నాటికి పూర్తికానున్నాయని తెలిపారు. రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. అయితే సొంత స్థలం కూడా లేని నిరుపేద కుటుంబాలకు గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా క్యూర్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఎల్ఐజీ అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఎలాంటి మధ్యవర్తులు, లాభాపేక్ష లేదా స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఈ గృహాలను నిర్మించి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 26 నియోజకవర్గాల్లో తొలి దశలో 500 అపార్ట్‌మెంట్ గృహాలను నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి ఫ్లాట్ 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, రహదారులు తదితర అన్ని మౌలిక వసతులతో నిర్మించనున్నట్లు వెల్లడించింది. ఈ పథకానికి వార్షిక కుటుంబ ఆదాయం రూ.6 లక్షలలోపు ఉండి, సొంత ఇల్లు లేదా ఇంటి స్థలం లేని కుటుంబాలు అర్హులు అని ప్రభుత్వం స్పష్టం చేసింది. నగరంలోని నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించడంలో ఈ పథకం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ఛత్రోన్ కీ గూంజ్'తో జేఎన్టీయూలో యువత గళం

- విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

**తెలంగాణ చౌరస్తా, కూకట్ పల్లి:**



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు భారత జాతీయ కాంగ్రెస్, భారత యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ సంయుక్త ఆధ్వర్యంలో జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది విద్యార్థులు, యువజన నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు హాజరై యువత సమస్యలపై తమ గళాన్ని వినిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని యువత అభివృద్ధే భారత అభివృద్ధికి పునాది అని అన్నారు. విద్యార్థుల సంక్షేమం, యువత భవిష్యత్తు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల కారణంగా విద్యా వ్యవస్థ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఆయన విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకులు, పెరుగుతున్న నిరుద్యోగం, ఉన్నత విద్యలో అవకాశాల కొరత వంటి సమస్యలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తుందని, వారి ఆశయాల సాధనకు ప్రతి అడుగులోనూ అండగా నిలుస్తుందని బండి రమేష్ తెలిపారు. యువత గొంతుకను దేశవ్యాప్తంగా బలంగా వినిపించడమే 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాకీర్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, బల్మూర్ వెంకట్, తూము వేణు, నాగిరెడ్డి, పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, శ్రీనివాస్ బాబు, సాయిబాబా చౌదరి, రంగమోహన్, గంధం రాజు, రాజేష్, శంకర్, పులి శివ గౌడ్, రామారావు, సునీల్, శ్రీకాంత్ పటేల్, మైఖేల్, బాలరాజు, సంధ్య రాణి, జ్యోతి, రమ్య తదితర కాంగ్రెస్, యువజన, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



# 51 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలి

- తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్ డిమాండ్

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా :**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మూడు అంచెల ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆగస్టు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను తొర్రూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు జంజిరాల నాగరాజు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.51 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు.అలాగే 2003 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టైం స్కేల్ అమలు చేయాలని, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లించాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, 2008 డీఎస్సీ ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకమైన ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎనగాండ్ల నాగిరెడ్డి,జీవిలికపల్లి నరహరి,జిల్లా కార్యదర్శి పులిగుజ్జ యాకయ్య, తొర్రూర్ మండల బాధ్యులు మేరుగు రమేష్,ఆకోజు అరుణ్,నెల్లికుదురు మండల ప్రధాన కార్యదర్శి చెన్నోజు కళ్యాణ్, పెద్దవంగర మండల ప్రధాన కార్యదర్శి కోడూరు మధుసూదన్ రెడ్డి,దంతాలపల్లి మండల గౌరవ అధ్యక్షుడు తెమడ హరిబాబు,వనం నరసింహులు,కుశాని రవీందర్,న్యారం పరంధామ,చిలకని భాస్కర్,పెట్లోజు సోమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ప్రారంభోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ చామ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు

**ఎల్ బి నగర్,తెలంగాణ చౌరస్తా:**




హైదరాబాద్ జిల్లా రైతు సహకార కేంద్ర బ్యాంక్ హయత్ నగర్ నూతన శాఖ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హయత్ నగర్ రైతు సహకార సంగం బ్యాంకు చైర్మన్ చామా కృష్ణారెడ్డి, డైరెక్టర్లు ముత్యాల రాజశేఖర్, ముత్తడి సుధాకర్ రెడ్డి, పెద్దిటి నరసింహారెడ్డి బ్యాంకు మేనేజర్ గౌతమి హాజరై ప్రారంభించారు. అనంతరం అతిధులు మాట్లాడుతూ.. హైదరాబాదులో బ్యాంక్ యొక్క 36వ శాఖను ప్రారంభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. బ్యాంకు సేవలను మరింత వేగంగా పారదర్శకంగా నిర్వహించడానికి కృషి చేస్తామని అన్నారు. ఖాతాదారుల యొక్క నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా బ్యాంకు లోన్లు, లాకర్ సదుపాయం తో పాటు, రైతులకు అవసరమైన రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సాయి చరణ్ రెడ్డి, బ్యాంకు సీఈవో మల్లికార్జున్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చామ విజయ శేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సుప్రసేనా రెడ్డి,జొరక శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు చామ అనుకిరణ్ రెడ్డి, కొలను శేఖర్ రెడ్డి, కందాడి శ్రీనివాస్ రెడ్డి, ఇతర బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.





# నారాయణ స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమనీ

- పాల్గొన్న జిఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు
- ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

హయత్ నగర్ నారాయణ పాఠశాలలో సోమవారం ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా నియమించబడిన విద్యార్థులకు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి ఏజీఎం రవీంద్రబాబు ప్రిన్సిపల్ లావణ్య, ఏవో చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు,సాషెలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముందు చిన్నారులు నృత్య ప్రదర్శనతో అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పాలనా పరమైన ఉత్తమ లక్షణాలు, సేవాభావం నేర్పిస్తూ నాయకులుగా తీర్చిదిద్దుతున్న యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ విద్యార్థులతో క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.జాతీయగీతంతో ముగిసిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్ర బాబు, ఏవో చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గుట్టపై దేవుడి గుడి .. గుట్ట కింద '1/70' దందా...

- గుట్ట మీద దేవుడు ఎలా ప్రత్యక్షమయ్యాడు
- భద్రాద్రి జిల్లాలో బినామీ మాఫియా గుట్టురట్టు..
- దేవుడి పేరుతో కోట్ల రూపాయల ల్యాండ్ స్కామ్
- లక్ష్మీదేవిపల్లిలో సామాన్యుల రక్తం తాగుతున్న అక్రమ రియల్టర్లు
- పర్మిషన్లు రాక బాధితుల ఆత్మఘోష
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే కుదరదు..
- అధికారులారా మేల్కొనండి గిరిజన నేతల అల్టిమేటం.

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా :**
భక్తిని అడ్డం పెట్టుకున్నారు.. గిరిజన చట్టాలను తుంగలో తొక్కారు.. అమాయక ప్రజల జీవితాలను నడిరోడ్డుపై నిలబెట్టారు! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరి నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో సాగుతున్న అక్రమ వెంచర్ల దందా ఇప్పుడు జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతోంది. గుట్ట పైన దేవుడు ప్రత్యక్షమయ్యాడంటూ నమ్మబలికి, గుట్ట కింద ఉన్న విలువైన గిరిజన భూములపై బినామీ ముసుగులో రియల్ మాఫియా పడగ విప్పింది. గిరిజన ప్రాంత రక్షణ కవచం లాంటి 1/70 చట్టాన్ని యథేచ్ఛగా కాలరాస్తూ అక్రమ లేఅవుట్లతో కోట్లు గడిస్తున్నారు.

**అప్పుల ఊబిలో సామాన్యుడు.. కేటుగాళ్ల జేబుల్లో కోట్లు!**
దేవుడి సెంటిమెంట్‌ను, అక్రమార్కుల మాయ మాటలను నమ్మి ప్లాట్లు కొన్న సామాన్య, మధ్యతరగతి ప్రజల పరిస్థితి ఇప్పుడు పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయింది.

**రూల్స్ ఒప్పుకోవు.. పర్మిషన్లు రావు:**
అప్పులు సప్పులు చేసి, జీవితకాల కష్టార్జితాన్ని వెచ్చించి ప్లాట్లు కొంటే.. తీరా ఇల్లు కడదామనే సరికి అధికారులు పర్మిషన్లు నిరాకరిస్తున్నారు. బ్యాంకుల నో.. వడ్డీల యస్ లీగల్ డాక్యుమెంట్లు లేకపోవడంతో బ్యాంకులు హోమ్ లోన్లు ఇవ్వడం లేదు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక బాధితులు విలవిల్లాడుతున్నారు.కొనే నాథుడే లేడు కనీసం ఆ ప్లాట్లను అమ్ముకుని బయటపడదామన్నా.. అది అక్రమ వెంచర్ అని తేలడంతో కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. బాధితులకు ఇప్పుడు జిల్లా కలెక్టరే దిక్కుగా మారారు."మా రక్తాన్ని కూడబెట్టి కొన్న ప్లాట్లు ఇప్పుడు చెల్లాచెదురయ్యాయి. ఇటు ఇల్లు కట్టుకోలేక, అటు అప్పులు తీర్చలేక చావలేక బతుకుతున్నాం. కలెక్టర్ మాకు న్యాయం చేయాలి."కన్నీరు మున్నీరవుతున్న బాధితులు

**అధికారులు మొద్దునిద్ర వీడాలి.. ఆ రాళ్లను పీకేయాలి!**
గతంలో ఈ అక్రమాలపై వార్తలు రాసినప్పుడు మాత్రమే కాసేపు హడావుడి చేసి, ఆ తర్వాత మళ్లీ మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్న, పంచాయతీ అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా మేల్కొని తక్షణమే ఈ క్రింది చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు




తక్షణ డిమాండ్లుప్రభుత్వ హెచ్చరికా బోర్డులు ఈ వెంచర్లు 1/70 చట్టానికి విరుద్ధమని, ఇక్కడ ప్లాట్లు కొంటే ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేస్తూ తక్షణమే ప్రభుత్వ బోర్డులు నాటాలి.లేఅవుట్ రాళ్ల ధ్వంసం అక్రమంగా పాతిన లేఅవుట్ రాళ్లను వెంటనే పీకేయాలి.కలెక్టర్‌కు డాక్యుమెంట్లు ఈ దందా వెనుక ఉన్నడాక్యుమెంట్లన్నింటినీ స్వాధీనం చేసుకుని కలెక్టర్ టేబుల్ ముందు పెట్టాలి.

**ఆర్టీఐ అస్త్రంతో 'అసలు దొంగల' వేట!**
గిరిజనుల హక్కులను కాలరాస్తూ, బినామీల ముసుగులో ఈ దందా నడిపిస్తున్న ఆ "అసలు మూట దొంగ" ఎవరో సమాజం ముందు నిలబెడతామని గిరిజన నేతలు హెచ్చరిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా కంటితుడుపు చర్యలు ఆపి, శాశ్వత పరిష్కారం చూపకపోతే తాము సమాచార హక్కు చట్టం (ఆర్ టీ ఐ ) ద్వారా అన్ని ఆధారాలు సేకరించి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ భారీ భూ కుంభకోణంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, అమాయక ప్రజలను ఆదుకోవాలని, అక్రమార్కులను జైలుకు పంపాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



# ఎమ్మెల్యే జారె అభివృద్ధి పనుల పరిశీలన

- క్రీడా మైదానం, సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన
- క్రీడాకారులకు ఆధునిక వసతుల కల్పన
- గడువులోగా సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి కావాలి
- ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**
అశ్వారావుపేట మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబుతో కలిసి ఆయన క్రీడా మైదానాన్ని, పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనులను సందర్శించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.యువతకు నాణ్యమైన క్రీడా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆటలకు అనువుగా మైదానాన్ని తీర్చిదిద్దాలని, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ, విశ్రాంతి గదులు వంటి మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేయాలని సూచించారు. పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న లైటింగ్ వ్యవస్థ ప్రజల భద్రతకు, పట్టణ సౌందర్యానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్వహణ సమస్యలు రాకుండా పనులుండాలని స్పష్టం చేశారు.అశ్వారావుపేటను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మిండా హరిబాబు, జీనుగు రవీంద్ర, నాయకులు కోలా లక్ష్మీనారాయణ, జూపల్లి ప్రమోద్, వెలుపుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన కాంగ్రెస్ నేత రామస్వామి

- ఎమ్మెల్యే ఆదినారాయణ పరామర్శ
- ప్రమాద బాధితుడికి అండగా ఎమ్మెల్యే, వైస్ చైర్మన్



**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**
ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ప్రస్తుతం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుపులేటి రామస్వామి.ని అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు గురువారం పరామర్శించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు. స్వయంగా రామస్వామి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ప్రమాదానికి గురైన బాధితుడికి, ఆయన కుటుంబానికి పార్టీ తరఫున, వ్యక్తిగతంగా అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజాప్రతినిధులు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి ప్రమోద్, మిండా హరిబాబు, కోల లక్ష్మీ నారాయణ, అల్లాడి రామారావు, కర్నాటి శీను, ఆర్ఎంపీ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# పూర్వ విద్యార్థుల సమ్మేళనం...

- ఆపదలో ఉన్న తోటి మిత్రుడికి రూ. 5,000 ఆర్థిక సాయం

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**
కమాన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 197980 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఫంక్షన్ హాల్ లో సోమవారం ఘనంగా జరిగింది. సరిగ్గా 46 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకోవడం పట్ల పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పటి సైన్స్ టీచర్ దన్నమనేని రాజేశ్వరరావుకు జ్ఞాపిక అందజేసి, పాదాభివందనాలు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనం విజయవంతంగా నిర్వహించిన జబ్బార్ ఖాన్‌కు సహచరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కేవలం పలకరింపులకే పరిమితం కాకుండా, ఆపదలో ఉన్న తమ తోటి మిత్రుడికి రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను, పాఠశాల ముచ్చట్లను నెమరువేసుకుంటూ, ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ చైర్మన్ సానా రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో బి. రాజశేఖర్, మల్లయ్య, కె. ఉపేందర్, కె. రాజమల్లు, రాములు, రాజలింగయ్య, నారాయణ, ఎం. వెంకటరెడ్డి, డి. రవీందర్, గుమ్మడి భూమయ్య, ఇ రాములు, ముస్త్యాల రమేష్, టి. సత్యనారాయణ, గుండ వెంకటరమణ, మెట్టు గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సాగునీరు అందించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- తక్షణమే డి-83, డి-86 కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలి
- రైతుల సమస్యలపై బీజేపీ ఆగ్రహం

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**
జిల్లాలోని డి83, డి86 కాలువల ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటితో పాటు రైతులకు అవసరమైన వ్యవసాయ విద్యుత్‌ను కూడా నిరంతరంగా సరఫరా చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. వెంటనే డి83, డి86 కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, రైతులకు అండగా నిలుస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు శనిగరం రమేష్, జిల్లా నాయకులు కంకణాల జ్యోతి బాస్, భూషణ్, వేణి శ్రీనివాస్ గౌడ్, తూడి రవీందర్, మనోహర్, కొమ్మరిశెట్టి రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# సిరిపురంలో మురుగు నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా**
రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుధ్య వసతులు కల్పించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో IICT ప్రజాప్రతినిధులు,అధికారులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న జగన్మోహన్,పట్టణ అధ్యక్షులు జమీల్ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి,కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి,సీపీఎం పార్టీ జిల్లా నాయకులు మేక అశోక్ రెడ్డి,వార్డ్ మెంబెర్ అంజద్,పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ నిషేధంపై ఉపాధ్యాయులు ఆదర్శం

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని చెప్పడమే కాదు,స్వయంగా ఆచరించి,ఆదర్శంగా నిలుస్తున్నారు.నారాయణపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు బోధన్ నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రస్తుతం జిల్లా స్థాయిలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.జిల్లా పరిధిలో యుపిఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్ శిక్షణ విడుదలవారీగా పాల్గొంటున్నారు.వీరికి మధ్యాహ్న భోజనం టి,బిస్కెట్లు అందజేయడానికి ప్లాస్టిక్ ప్లేట్లు,గ్లాస్ బదులుగా స్టీల్ ప్లేట్లను మరియు స్టీల్ గ్లాసుల్లో వినియోగిస్తున్నారు.ఈ శిక్షణలో జీవశాస్త్ర,తెలుగు,సాంఘిక శాస్త్ర బోధించు ఉపాధ్యాయులు విద్యార్థులకు పర్యావరణ పరిక్షణపై బోధిస్తుంటారు.ఈ అంశాలు ఆచరణలో లేకుండా పోతున్నాయని గుర్తించి వారు ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా స్టీల్ ప్లేట్లు ఉపయోగించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్లాస్టిక్ రహితంగా భూమిని మార్చే కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముందు వరుసలో నిలవడం అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి హెచ్.భానుప్రకాష్ పేర్కొన్నారు.కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర డిఆర్పిలు నాగేష్,శ్రీనివాసులు,అయ్యప్ప,శంకర్,జీవశాస్త్ర డిఆర్పిలు సంతోష్ కుమార్,శ్రావణి,జహంగీర్,తెలుగు బోధించే డిఆర్పిలు వీరేంద్ర కుమార్,శ్రీనివాస్,భాస్కర్ ఉపాధ్యాయులు,సిబ్బంది నరసింహ,లక్ష్మణ్ పాల్గొన్నారు.



# మక్తల్‌నారాయణపేటకొడంగల్ ప్రాజెక్టుతో సస్యశ్యామలం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**
నారాయణపేట జిల్లా ప్రాంతాన్ని5e కరువు జిల్లా కాకుండా సస్యశ్యామల జిల్లాగా మార్చడం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఉట్కూరు మండలం తిప్రస్పల్లి దగ్గర 69 జీవో ప్రాజెక్టుకు సంబంధించిన పైపులైను పనులను పూజా కార్యక్రమం చేసి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి సాగు తాగునీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు,మక్తల్‌నారాయణపేటకొడంగల్ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో సాగు తాగునీరుకు కదులు ఉండదని రైతాంగం సుభిక్షంతో వర్ధిల్లుతుందని అన్నారు.ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన ఈ ప్రాజెక్టు పూర్తి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు.కార్యక్రమంలో సింగారం మాజీ సర్పంచ్ శీను,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎడ్ల రాజు,కాంట్రాక్టర్ వెంకటేష్ ఉన్నారు.






# కుంట్లూరు 'సర్వే 24'లో తీవ్ర ఉద్రిక్తత..

- రంగంలోకి రెవెన్యూ యంత్రాంగం!
- కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై ఇరువర్గాల క్లెయిమ్‌లు
- ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

**అబ్దుల్లాపూర్‌మెట్, (తెలంగాణ చౌరస్తా):**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 24 భూవివాదం తీవ్ర రూపం దాల్చింది. వివరాల్లోకి వెళితే కుంట్లూరు గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 24 లో మొత్తం 84 ఎకరాల 21 గుంటల భూమి ఉండగా ఈ ప్రభుత్వ స్థలంలో ప్రాథమిక వైద్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, గ్రామపంచాయతీ భవనాలు పోగా మిగిలి ఉన్న సుమారు మూడు ఎకరాల భూమిలో కొంత భాగం కుంట్లూరు తెలంగాణ నగర్ ఎదురుగా ఉన్న భూమిపై రెండు వర్గాల వారు ఈ స్థలంపై హక్కు తమదేనంటూ పట్టుబడుతుండటంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సోమవారం రంగంలోకి దిగి భూఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకుని ప్రభుత్వ బోర్డు నాటారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం తమ సంఘానికే కేటాయించిందని పేర్కొంటూ గౌడ సంఘం ప్రతినిధులు జేసీబీలతో చదును పనులు చేపట్టగా.. హయత్‌నగర్ రైతు సహకార సంఘం కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం ఇక్కడే 500 గజాల స్థలాన్ని గతంలోనే అధికారికంగా కేటాయించిందని అన్నారు. కానీ కొందరు వ్యక్తులు దాని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. తమకు భూమిని కేటాయించిన సమయంలో సంఘంలో సరిపోను నిధులు లేకపోవడంతో భవన నిర్మాణం చేపట్టలేకపోయామని..రైతు సహకార సంఘం భవన నిర్మాణానికి అనుమతులు కూడా పొందామని సీఈఓ మల్లికార్జున్ వెల్లడించారు.ఈ విషయంలో తమకు కేటాయించిన భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారంటూ హయత్‌నగర్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని తెలియజేశారు.ఇది ఇలా ఉండగా మరోవైపు 1978లోనే ప్రభుత్వం తమతో పాటు 25 కుటుంబాలకు 11 గంటల స్థలాన్ని కేటాయించిందని, గత 40 సంవత్సరాలుగా ఇక్కడే పశు పోషణ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని గ్రామానికి చెందిన చాడ ఎల్లయ్య కుటుంబ సభ్యులు వెల్లడించారు. జీవో 59 ద్వారా 2022-23లోనే చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్లు కూడా పూర్తయ్యాయని చాడ ఎల్లయ్య అలియాస్ గుజ్జ ఎల్లయ్య కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. జీవనం కోసం తాము ఇళ్లు నిర్మించుకుంటుంటే కొందరు అడ్డుపడి నిర్మాణాలను, కూల్చివేశారని ఆరోపించారు.

**ప్రభుత్వ బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు:**
విషయం తెలుసుకున్న రెవెన్యూ యంత్రాంగం సర్వే నంబర్ 24కు సంబంధించి గతంలో జారీ చేసిన భూ రికార్డులు,హక్కులు,కేటాయింపుల ఉత్తర్వులు,ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే చట్టప్రకారం తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.అనంతరం సదరు భూమిలో రెవిన్యూ అధికారులు ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.